డివైడర్‌ను ఢీకొట్టిన బైక్
- ఇద్దరు యువకులు మృతి, మరొకరికి తీవ్రగాయాలు
- సంగాపూర్ రోడ్డులో ప్రమాదం

7లో

కిడ్నాపర్ అనుకుని.. దేహశుద్ధి
- పోలీసులకు అప్పగింత



కంది మండల పరిధిలో సాగవుతున్న వరి

యాసంగి తలకిందులు

- 16 వేల ఎకరాలు కోత
- తగ్గిన వరి సాగు విస్తీర్ణం
- పెరిగిన జొన్న సాగు

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 21 : ప్రస్తుత యాసంగి సీజన్‌లో పంటల సాగు అంచనాలు తలకిందులయ్యాయి. ఈ సీజన్‌లో ప్రధానంగా వరి, జొన్న, మొక్కజొన్న, గోదుమ, చెరకు, పెసర తదితర పంటలను సాగు చేస్తున్నారు. గత ఏడాది యాసంగి సీజన్‌తో పోలిస్తే ఈసారి సంగారెడ్డి జిల్లాలో వరి సాగు గణనీయంగా పడిపోయింది. అదే సందర్భంలో జొన్న పంట విస్తీర్ణం పెరగడం గమనార్హం.

1,66,262 ఎకరాల్లో పంటల సాగు

సంగారెడ్డి జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో మొత్తం 1,84,204 ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేశారు. కానీ, క్షేత్రస్థాయిలో 1,66,262 ఎకరాలే సాగైనట్లు లెక్కలు తేల్చారు. జిల్లాలో గత యాసంగిలో సీజన్‌లో 1,82,641 ఎకరాల్లో ఆయా పంటలను సాగు చేశారు. గత సీజన్‌తో పోలిస్తే 16,379 ఎకరాల విస్తీర్ణం తగ్గింది. ఇందులో వరిని 1,09,915 ఎకరాల్లో సాగు చేయవచ్చని వ్యవసాయాధికారులు అంచనా వేయగా, 82,311 ఎకరాలకే పరిమితమైంది. అయితే, జొన్న పంటను 30,400 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేస్తే క్షేత్రస్థాయిలో 53,750 ఎకరాల్లో సాగైంది.

జిల్లాలో గత యాసంగి, ప్రస్తుత సీజన్ పంటల వివరాలు

పంటలు	గతేడాది యాసంగి	ప్రస్తుత సీజన్
వరి	10,9510	82,311
జొన్న	29,764	53,750
మొక్కజొన్న	5,890	5,120
గోధుమ	423	467
చెరకు	2,538	1,060
పెసర	24,004	18,355
పొద్దు తిరుగుడు	6,796	3,524
ఇతర పంటలు	3,716	11,675
మొత్తం	1,82,641	1,66,262

లోక్‌సభ ఎన్నికలకు సంసిద్ధం



ఈవీఎంలు, వీవీప్యాట్‌లను భద్రపరిచిన గది(ఫైల్)

- ఇప్పటికే ఈవీఎంల మొదటి దశ తనిఖీలు పూర్తి
- మెదక్ పార్లమెంట్ పరిధిలో 18,12,853 మంది ఓటర్లు



మెదక్, ఫిబ్రవరి 21 : మూడు నెలల క్రితమే అసెంబ్లీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించిన జిల్లా అధికార యంత్రాంగం పార్లమెంట్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు సంసిద్ధమవుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. ఈ నెల 8న ఓటర్ల తుది జాబితా వెలువరించింది. మెదక్ లోక్‌సభ స్థానంలో 18,12,853 మంది ఓటర్లు ఉన్నారు. ఇటీవల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రభుత్వం విస్తృతంగా నిర్వహించడంతో ప్రజలు ముఖ్యంగా యువత ఓటును నమోదు చేసుకున్నారు. ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను పెంచనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 2,098 పోలింగ్ కేద్రారలు ఉండగా అదనంగా మరో 30 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేశారు. గతంలో ఉన్న అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మరింత పక్కాగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తోంది. ఎన్నికల నేపథ్యంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. సొంత జిల్లాల్లో పనిచేస్తున్న, ఒకేచోట మూడేళ్లుగా పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ప్రస్తుతం మెదక్ లోక్‌సభ స్థానం పరిధిలోని మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో పనిచేస్తున్న చాలా మంది అధికారులు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు.

షెడ్యూల్ అనంతరం ఈవీఎంల ర్యాండమైజేషన్

ఎన్నికల నిర్వహణలో ప్రధాన భూమిక పోషిస్తున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ నాణ్యతా తనిఖీ ఇప్పటికే పూర్తయింది. వారం క్రితం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల ఎఫ్‌ఎల్‌సీని మాక్‌పోలింగ్ నిర్వహించి నిర్ధారించారు. ఎన్నికల ప్రకటన వెలువడిన అనంతరం ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈవీఎంలను పటిష్ఠ భద్రత నడుమ గోదాముల్లో భద్రపర్చారు.

ఓటు నమోదుకు మరింత గడువు

అర్హులైన వారందరినీ ఓటరు జాబితాలో చేర్చేందుకు యువతకు మరోమారు ఓటు నమోదుకు అవకాశం కల్పిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగు శాతం తగ్గిన నేపథ్యంలో ఈసారి ఓటింగ్ శాతం పెరిగేందుకు ఈసీ కార్యాచరణ రూపొందిస్తోంది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో మోహరించి విస్తృతంగా ప్రచారం సాగించారు. ప్రస్తుతం ఓటర్ నమోదు గడువును పొడగించడం వల్ల మిగిలిన వారు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి అవకాశం లభించింది. అధికారులు దరఖాస్తులను పరిశీలించి ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు మార్పులు చేర్పులు, పేర్ల తొలగింపునకు అవకాశం ఇచ్చారు. ఆన్‌లైన్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలోని అన్ని కళాశాలల్లో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఓటు ద్వారా ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని, శాస్త్రీయ పద్ధతుల్లో వివరించడానికి ఎన్నికల సంఘం బృందాల ఆధ్వర్యంలో వివరించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా ఓటర్లు

అసెంబ్లీ	ఓటర్లు(లక్షల్లో)
మెదక్	2,16,748
సిద్దిపేట	2,36,474
నర్సాపూర్	2,26154
సంగారెడ్డి	2,47,338
పటాన్‌చెరు	4,07,419
దుబ్బాక	1,99,236
గజ్వేల్	2,79,489
మొత్తం	18,12,853

బీఆర్‌ఎస్‌కు నలుగురు కౌన్సిలర్ల గుడ్‌బై

- రామాయంపేట బల్దియాలో 'మైనంపల్లి' సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

రామాయంపేట, ఫిబ్రవరి 21 : రామాయంపేట మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు నలుగురు కౌన్సిలర్లు గుడ్‌బై చెప్పారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో బుధవారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వారిలో దేమె యాదగిరి, చిలుక గంగాధర్, సుందర్‌సింగ్ ఉన్నారు. మొదటి నుంచి అభివృద్ధికి నిధులు రాక తాము ఇబ్బందులు పడాల్సి వచ్చిందని, అందుకే పట్టణ పురోభివృద్ధి లక్ష్యంగా తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ నుంచి మొత్తం 12 మంది కౌన్సిలర్లు గెలవగా.. ప్రస్తుతం కాంగ్రెస్‌లో నలుగురు చేరడంతో.. బీఆర్‌ఎస్ సంఖ్య ఎనిమిదికి పడిపోయింది. ఇదిలా ఉంటే ఒక్క సీటూ లేని కాంగ్రెస్ ఖాతాలో నలుగురు కౌన్సిలర్లు చేరడం గమనార్హం.



మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు

స్టాక్ ట్రేడర్‌కు సైబర్ నేరగాళ్ల వల

- రూ.27.71 లక్షల టోకరా



పటాన్‌చెరు, ఫిబ్రవరి 21 : ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ నిర్వహించే ఓ స్టాక్ ట్రేడర్.. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి రూ.27.71 లక్షలు కోల్పోయారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీలో నివాసం ఉండే స్టాక్ ట్రేడర్ కొంత కాలంగా పలుర కాల ఆన్‌లైన్ వ్యాపారాలు నిర్వహిస్తున్నాడు. ఏంజిల్ వన్ అనే ఆన్‌లైన్ ట్రేడింగ్ సంస్థకు సంబంధించిన యాప్‌లో నగదును జమ చేశారు. అటువైపు నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో మార్ఫింగ్ లోగోకు సంబంధించిన యాప్‌లో నగదు జమైనట్లు గుర్తించాడు. మోసపోయానని గ్రహించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ప్రారంభించారు.

మరో సైబర్ నేరంలో రూ.15.37 లక్షలు

ఆన్‌లైన్ జాబ్‌తో పేరుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని నమ్మించిన సైబర్ కేటుగాళ్లు రూ.15.37 లక్షలు కొల్లగొట్టారు. అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని భవానిపురం కాలనీలో నివాసం ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆన్‌లైన్ జాబ్‌తో అదనపు ఆదాయం సంపాదించుకోవచ్చని సైబర్ నేరగాళ్లు ముగ్గులోకి దింపారు. నిజమని నమ్మిన సదరు వ్యక్తి మొదట రెండు వేలతో ప్రారంభించాడు. లాభాలు రావడంతో నమ్మకం కుదిరి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించాడు. అలా మొత్తం రూ.15.37 లక్షలు యాప్‌లో జమచేశాడు. తన డబ్బు తన అకౌంట్‌కు జమ చేయాలని కోరగా 10 శాతం సర్వీస్ ట్యాక్స్ పడుతుందని, ఆదాయపు పన్ను సమస్యలు ఉన్నాయంటూ కాలయాపన చేయడం ప్రారంభించారు. నగదును క్రిప్టో కరెన్సీలో చెల్లిస్తామని నమ్మించే ప్రయత్నం చేశారు. చివరకు మోసపోయామని తెలుసుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని అమీన్‌పూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలకు రూ.27 కోట్ల రుణం

- యూనియన్ బ్యాంక్‌లో భారీ కుంభకోణం
- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



పటాన్‌చెరు, ఫిబ్రవరి 21: తప్పుడు ధ్రువీకరణ పత్రాల ఆధారంగా రూ.27 కోట్ల రుణం జారీ చేసిన బ్యాంకు సిబ్బందిని రామచంద్రాపురం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. రామచంద్రాపురం ఆంధ్రా బ్యాంక్ (ప్రస్తుతం యూనియన్ బ్యాంక్)లో 2016 వరకు మంజూరైన వ్యాపార రుణాలలో భారీగా అవకతవకలు జరిగాయని అప్పట్లోనే బ్యాంక్ ఆడిటర్లు గుర్తించారు. ఈ మేరకు 2021లో బ్యాంక్ ఆడిటర్ల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. మొత్తం 17 కంపెనీలకు మంజూరు చేసిన రుణాల్లో సుమారు రూ.27 కోట్ల మేర అవతవకలు జరిగాయని పోలీసుల దర్యాప్తులో తేలింది. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, వ్యాపార ఫర్మ్‌లు, తనఖా పెట్టిన ఆస్తుల విలువను అధికరెట్లు పెంచి ఇచ్చిన నకిలీ పత్రాల ఆధారంగా కోట్లాది రూపాయల రుణాలను మంజూరు చేశారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న బ్యాంకు సిబ్బంది, వాల్యువేటర్, లీగల్ అడ్వైజర్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మంటల్లో సబ్‌స్టేషన్

- పేలిన ట్రాన్స్‌ఫార్మర్
- తోడైన ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్
- ఆరు గంటల పాటు ఎగిసిపడ్డ అగ్నికీలలు
- మూడు ఫైర్ ఇంజన్లు వచ్చినప్పటికీ నిష్ఫలితం
- సిద్దిపేట నియోజకవర్గంలో నిలిచిన కరెంటు



ఎగిసిపడుతున్న మంటలను ఆర్పుతున్న ఫైరింజన్

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 21: సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తాలో ఉన్న సబ్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం 7 గంటలకు భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. 220 కేవీ సబ్‌స్టేషన్‌లో ఉన్న 100 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదవశాత్తు పేలడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న ఆయిల్‌తో భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. మూడు ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. దాదాపు 6 గంటల వరకు మంటలు చెలరేగాయి. సంఘటనా స్థలం వద్ద జనం భారీగా చేరుకోవడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సబ్‌స్టేషన్ లోనికి ఎవరూ వెళ్లకుండా అడ్డుకున్నారు. సుమారు రూ.4కోట్ల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. సిద్దిపేట నియోజకవర్గ గ్రామాలతో పాటు దుబ్బాక నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు అర్ధరాత్రి వరకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం 7 గంటల నుంచి అర్ధరాత్రి వరకు కరెంటు సరఫరా నిలిచిపోయింది.

నిర్లక్ష్యమే కారణమా?

సిద్దిపేట సబ్‌స్టేషన్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం వెనుక విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నదా? అంటూ స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పేలిన ట్రాన్స్‌ఫార్మర్ 1997లో సబ్‌స్టేషన్ కొత్తగా ఏర్పాటు చేసినప్పటిదని, పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇన్ని రోజులు ఎందుకు కొనసాగించారని ప్రశ్నిస్తున్నారు.

సంఘటనా స్థలానికి హరీశ్

విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే హరీశ్‌రావు హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వచ్చారు. మార్గంమధ్యలోనే విద్యుత్‌శాఖ అధికారులతో ప్రమాదంపై చర్చించారు. దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్ ఫైర్‌స్టేషన్లకు ఫోన్‌చేసి ఫైర్‌ఇంజన్లను సంఘటనా స్థలానికి పంపించాలని కోరారు. విద్యుత్ శాఖ మంత్రి విక్రమార్కకు ఫోన్‌చేసి విషయాన్ని తెలియజేశారు. సంఘటనా స్థలానికి దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి సహా చేరుకొని మూడు గంటలపాటు పర్యవేక్షించారు.

జిల్లా అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

- యాజమాన్యాలు లాభంలో రెండు శాతం సీఎస్ఆర్ నిధులను ఇవ్వాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21 : జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు సామాజిక బాధ్యతగా జిల్లా అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డి క్యాంపు కార్యాలయంలో అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు కంపెనీ యాక్ట్ మేరకు అభివృద్ధికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధులను అందించి సహకరించాలని కోరారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో స్థానికంగా కంపెనీ ఉన్న ప్రాంతానికి, జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆయా కంపెనీలకు ఐదేళ్లల్లో వచ్చిన లాభం సీఎస్ఆర్ కింద జిల్లాలో వెచ్చించిన నిధులకు సంబంధించిన వివరాలు అందించాలన్నారు. పరిశ్రమలు తమ నగదు లాభంలో రెండు శాతం సీఎస్ఆర్ కింద నిధులను జిల్లాలో విద్యా, వైద్యం కోసం ఖర్చు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కంపెనీ వారిగా ఇప్పటివరకు ఎంత ఇచ్చారు.. ఇంకా ఎంతివ్వాల్సి ఉందనేది సంవత్సరం వారీగా వివరాల నివేదికను సీఎస్ఆర్ నోడల్ అధికారులు అందించాలని ఆమె సూచించారు. పరిశ్రమలు ఆ ప్రాంతాల్లో ఉన్న ప్రజల అవసరాలను గుర్తించి, సౌకర్యాలను కల్పించేందుకు యాజమాన్యాలు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్, డీఈవో వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రాజేశ్వర్, బీసీ సంక్షేమాధికారి జగదీష్, ఎస్టీ సంక్షేమాధికారి పిరంగి, ఎస్సీ సంక్షేమాధికారి అఖిలేశ్వర్ రెడ్డి, ఎక్సైజ్ శాఖాధికారి నవీన్‌చందర్, వివిధ శాఖల అధికారులు, పలు పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విపణి కార్యక్రమంలో మెహిందీ వేసుకుంటున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి - సంగారెడ్డి అర్బన్

భార్య హత్యకు భర్త సుపారీ

- కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 21: నిత్యం గొడవలు పడుతూ మనశ్శాంతి లేకుండా చేస్తుందన్న కారణంతో మొదటి భార్యను సుపారీ ఇచ్చి హత్య చేయించిన భర్తను, నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా హవేళీఘణపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఆదికేశవులు వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా హవేళీఘణపూర్ మండలం తొగిట గ్రామానికి చెందిన మంద ఆశయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య మంద సంగమణి(51), రెండో భార్య మంజులతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొత్తగా కట్టుకున్న ఇల్లు, పొలం విషయంలో కొంతకాలంగా ఆశయ్యకు, సంగమణికి గొడవలు జరుగుతూ ఉన్నాయి. ఈ క్రమంలో మొదటి భార్యను ఎలాగైనా వదిలించుకోవాలని ఆశయ్య పథకం పన్నాడు. ఇందులో భాగంగా అదే గ్రామానికి చెందిన మాచబోయిన మహేష్‌కు తన భార్య సంగమణిని చంపితే రూ.20 వేలు ఇస్తానని ఒప్పందం చేసుకున్నాడు. ఆశయ్య ఈ నెల 11న రెండో భార్య మంజులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. అదేరోజు రాత్రి మహేష్ ఆశయ్య చెప్పినట్లుగా ఇంటి కమాన్ పొయ్యి రంధ్రం నుంచి లోపలికి దిగాడు. జీరు తీయగా.. మరో నిందితుడు శివకుమార్ ఇంటిలోకి వచ్చాడు. ఈ ఇద్దరు నిద్రిస్తున్న సంగమణి గొంతుపై ఈలపీటతో నరకడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. అనంతరం బెడ్ పైన ఉన్న బ్యాగులోని రూ.20 వేలను, చెవి కమ్మలు, పుస్తెలతాడును తీసుకుని పారిపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు చాకచక్యంగా విచారణ జరిపి నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో సీఐ ఆదికేశవులతో పాటు ఎస్ఐ ఆనంద్‌గౌడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ

పేదలకు పనులు కల్పించి ఉపాధి చూపించాలి

● ప్రజాదర్బార్‌లో డీఆర్డీవో అదనపు పీడీ విరోజా

తూప్రాన్, ఫిబ్రవరి 21: పేదలకు పనులు కల్పించి ఉపాధిని చూపించాలని మెదక్ అదనపు డీఆర్డీవో పీడీ విరోజా పేర్కొన్నారు. తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 14వ విడత మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజాదర్బార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విరోజా మాట్లాడుతూ తూప్రాన్ మండలం పనులు కల్పించడంలో వెనుకబడిపోయిందని, ఈ పరిస్థితి రాకుండా చూడాలన్నారు. తూప్రాన్ మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధిహామీ పథకంపై ఈనెల 11 నుంచి 20 వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఏడాదికాలంలో రూ.3,36,32,890 విలువైన పనులు చేపట్టగా కూలీలకు రూ.2,93,70,500లు, మెటీరియల్‌కు రూ.42,62,390 చెల్లింపులు చేశారు. ప్రజాదర్బార్‌లో ఊరూరా చేపట్టిన పనులు, జరిగిన అవకతవకలు వివరించారు. ఈ పనుల్లో జరిగిన అవకతవకలకు రూ.1,19,408 రికవరీకి రాసినట్లు విరోజా వివరించారు. పనుల్లో అలసత్వం, నిర్లక్ష్యంపై రూ.7 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డి స్వప్న, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ ప్రభాకర్, క్వాసీ రమాకాంత్, ఏపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న డీఆర్డీవో అదనపు పీడీ విరోజా

లారీని ఢీకొన్న కారు, వ్యక్తి మృతి

జహీరాబాద్, ఫిబ్రవరి 21: కారుతో లారీని వెనక నుంచి ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ లక్ష్మారెడ్డి వివరాల ప్రకారం.. బీదర్ జిల్లా నౌబాద్‌కు చెందిన శివశంకర్(36), మరో ముగ్గురు స్నేహితులు కలిసి శ్రీశైలం నుంచి కారులో నౌబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో జహీరాబాద్ పట్టణ సమీపం అల్గోల్ చౌరస్తాలోని బైపాస్‌పై లారీని ఓవర్‌టేక్ చేస్తూ ఢీకొట్టారు. దీంతో శివశంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురికి గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్నేహితుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లోక్ అదాలత్‌లో న్యాయం అందేలా చూడండి

● సంగారెడ్డి జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21: లోక్ అదాలత్‌లో కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా చూడాలని సంగారెడ్డి జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కోర్టులో ఇన్సూరెన్స్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగారెడ్డి జిల్లాలో మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, రాజీపడే అన్ని కేసులను త్వరితగతిన పరిష్కారమయ్యేలా న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు, ఇన్సూరెన్స్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం



జంపన్నవాగులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు



మేడారం.. జన సంద్రం..

● లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం ● కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం ● సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర ● ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభంజనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే.. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చనని భావిస్తున్నారు. నెల రోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలిఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.



కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య

దూరప్రాంతాల నుంచి..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షల మంది మంగళవారం నుంచి మేడారం బాటపట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్ల బండ్లలో తరలివచ్చి మేడారం చుట్టుపక్కల విడిది చేశారు. దీంతో మేడారానికి ఎటుచూసినా 20 కి.మీ. వరకు భక్తుల సందోహమే కనిపిస్తోంది. వనం అంతా జనమైంది.

వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవింద రాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ బడ్జెట్ సమావేశం వాయిదా

- 14 మంది కౌన్సిలర్ల గైర్హాజరు
- గతంలో డ్రా చేసిన నిధుల లెక్కలు చెప్పాలని పట్టు
- కోరం లేకపోవడంతో తిరిగి వెళ్లిపోయిన అదనపు కలెక్టర్
- అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేసిన కౌన్సిలర్లు



సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కౌన్సిలర్

గజ్వేల్, ఫిబ్రవరి 20: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కౌన్సిల్‌లో మరోసారి ముసలం రాజుకున్నది. గతేడాది మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళిపై అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు అందించిన కౌన్సిలర్లు మరోసారి లెక్కల్లో తేడాపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ బడ్జెట్ సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేయగా, 14 మంది కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. కేవలం ఆరుగురు సభ్యులు మాత్రమే హాజరుకావడంతో కోరం లేక వాయిదా వేశారు. ఈ సమావేశానికి వచ్చిన సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ కోరం లేకపోవడంతో సమావేశం వాయిదా పడిన విషయం తెలుసుకుని తిరిగి వెళ్లిపోయారు. కాగా గత సర్వసభ్య సమావేశంలోని ఎజెండాలో పెట్టిన పలు అంశాల విషయమై తలెత్తిన సందేహాలను నివృత్తి చేయకపోవడంతో సమావేశానికి గైర్హాజరైనట్లు తెలిపారు. అంతేకాకుండా జనరల్ ఫండ్ నుంచి డంపింగ్ యార్డు, రాజీవ్‌పార్కుకు నిధులు పెట్టారని, వార్డులలో చిన్న చిన్న సమస్యలు తలెత్తితే వాటికి నిధులు కేటాయించడం లేదని కౌన్సిలర్లు తెలిపారు. ముఖ్యంగా గతేడాది ట్రీగార్డులకు సంబంధించిన నిధులు గోల్‌మాల్ అయ్యాయని, ట్రీగార్డులు మునిసిపాలిటీకి రాకున్నా నిధులను డ్రా చేశారని ఆరోపించారు. ఈ విషయమై మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి మాట్లాడుతూ తాను ఎలాంటి తప్పు చేయలేదని, అసంబద్ధ ఆరోపణలకు కౌన్సిలర్లు దిగుతున్నారని తెలిపారు.

అవిశ్వాస తీర్మానంపై చర్యలు తీసుకోవాలని కోరిన కౌన్సిలర్లు

అసంతృప్తిగా ఉన్న 14 మంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు గతంలో ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌కు సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఫిబ్రవరి 9, 2023 రోజుల ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై చర్యలు తీసుకోవాలని, బల నిరూపణకు తేదీని ప్రకటించాలని కోరారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో కౌన్సిలర్లు బొగ్గుల చందు, బాలమణి, రజిత, వరలక్ష్మి, కూరాకుల శ్రీనివాస్, అత్తెల్లి శ్రీనివాస్, విద్యారాణి, బాలేష్ ఉన్నారు.

క్రమశిక్షణతో పోలీస్‌శాఖకు మంచిపేరు తేవాలి

● సంగారెడ్డి ఇన్‌చార్జి ఎస్పీ బాలస్వామి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21: క్రమశిక్షణతో శిక్షణను పూర్తిచేసి పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకురావాలని సంగారెడ్డి ఇన్‌చార్జి ఎస్పీ బాలస్వామి సూచించారు. కంది మండల చిద్రుప్ప గ్రామంలోని పోలీస్ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతున్న ట్రైనీ పోలీసులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో శరీరదారుఢ్యంతో పాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కమ్యూనికేషన్ స్కిల్స్, తదితర అంశాలను బోధిస్తారని తెలిపారు. తొమ్మిది నెలలపాటు పొందే శిక్షణ మిమ్మల్ని శారీరకంగా దృఢపర్చడమే కాకుండా మానసిక వికాసాన్ని పెంపొందిస్తున్నదన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా వృత్తి ధర్మాన్ని పాటించే ఆత్మస్థైర్యాన్ని నింపడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకుని రాష్ట్ర పోలీస్‌శాఖకు మంచి సేవలందించాలని సూచించారు. ట్రైనీ పోలీసులు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం అదనపు ఎస్పీ సంజీవ్‌రావు మాట్లాడుతూ గతంలో కానిస్టేబుల్ ఉద్యోగానికి పదో తరగతి, ఇంటర్ అర్హత గల వారు భర్తీ అయ్యేవారని, కానీ ప్రస్తుతం ఉన్నత చదువులు డిగ్రీ, బీటెక్, ఎంటెక్ అర్హత కలిగి ప్రజలకు దగ్గరగా ఉంటూ వారికి రక్షణ కల్పించే పోలీసు వృత్తిని ఎంచుకోవడం అభినందనీయమన్నారు. శిక్షణలో ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్నిరకాల సౌకర్యాలు కల్పించామన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఇన్‌చార్జి ఎస్పీ బాలస్వామి సూచించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, ఆర్ఐ శ్రీనివాస్, లా క్లాస్ శిక్షకుడు రాంబాబు, ఎస్బీ సీఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



చిద్రుప్పలోని పోలీస్ శిక్షణా కేంద్రంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఇన్‌చార్జి ఎస్పీ బాలస్వామి

కిడ్నాపర్ అనుకుని.. దేహశుద్ధి

● పోలీసులకు అప్పగింత

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21: ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న చిన్నారులను కిడ్నాప్ చేసేందుకు వచ్చాడనే నెపంతో ఓ వ్యక్తిని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసిన ఘటన బుధవారం సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకున్నది. సంగారెడ్డి పట్టణ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల మహిళా ప్రాంగణం కార్యాలయ సమీపం కాలనీలోని ఓ ఇంటి ఆవరణలో బాలుడు ఆడుకుంటున్నాడు. ఇంతలో ఓ యువకుడు బయటకు రమ్మని పిలుస్తున్నాడంటూ పిల్లాడి తల్లి కేకలు వేసుకుంటూ ఇంట్లోకి పరుగులు పెట్టింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు బాలుడిని ఎందుకు పిలుస్తున్నావంటూ ఆ వ్యక్తిని నిలదీయగా సమాధానం చెప్పేందుకు తడబడ్డాడు. దీంతో కాలనీవాసులు ఆగ్రహించి అతడిని స్తంభానికి కట్టేసి చితకబాదారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా జార్ఖండ్ వాసిగా తెలిసింది. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

- ఇద్దరు యువకులు మృతి, మరొకరికి తీవ్రగాయాలు
- సంగాపూర్ రోడ్డులో ప్రమాదం



ప్రమాదంలో మృతిచెందిన గడ్డమీది అరుణ్, అయాన్

గజ్వేల్, ఫిబ్రవరి 21: ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు మృతిచెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలైన సంఘటన గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్ రోడ్డులో బుధవారం చోటు చేసుకున్నది. దౌల్తాబాద్ మండలం శేరిపల్లి-బందారం గ్రామానికి చెందిన గడ్డమీది అరుణ్(20), తన స్నేహితుడైన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ప్రగతిధర్మారం గ్రామానికి చెందిన నక్కాని దిలీప్‌తో కలిసి వారు ఉంటున్న హాస్టల్ నుంచి బుక్స్ తెచ్చుకోవడానికి గజ్వేల్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో వర్గల్ మండలం గౌరారం గ్రామానికి చెందిన మహ్మద్ అయాన్(21)ను సంగాపూర్‌లోని హాస్టల్ వద్ద లిఫ్ట్ అడగ్గా ఎక్కించుకున్నాడు. బాలికల ఎడ్యుకేషన్ హబ్ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో గడ్డమీది అరుణ్ అక్కడికక్కడే మృతిచెందగా, బైక్ నడుపుతున్న అయాన్, మధ్యలో కూర్చున్న దిలీప్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, అక్కడున్న వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులతో పాటు అరుణ్ మృతదేహాన్ని గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. అయాన్ పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. అరుణ్ తండ్రి గడ్డమీది శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రులను తనిఖీ చేసిన కలెక్టర్



కౌడిపల్లి సీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా

కౌడిపల్లి, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలను కలెక్టర్ రాజర్షిషా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లోని పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సెలవు పత్రం రాసి పెట్టి, తేది వేయక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులతో మాట్లాడి, ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. సకాలంలో విధులకు హాజరు కాని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓకు ఆదేశాలు జారీ చేశారు. వైద్య సిబ్బంది పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వాస్పత్రుల్లో అత్యధిక ప్రసవాలు చేయడంలో జిల్లాలో కౌడిపల్లి మొదటి స్థానంలో ఉన్నదని కలెక్టర్ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ఆస్పత్రికి వచ్చే ప్రతీ రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

మమ్మీ, డాడీ వద్దు.. అమ్మ, నాన్నే ముద్దు

- మాతృభాషా దినోత్సవంలో సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

పుల్‌కల్, ఫిబ్రవరి 21: తెలుగు భాషకు ప్రాధాన్యమిచ్చి, మమ్మీ, డాడీ వద్దు.. అమ్మ, నాన్నే ముద్దు అని చాటాలని సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు కోరారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం తెలుగు ఫోరం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.కృష్ణారెడ్డి అధ్యక్షతన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడారు. అమ్మ, నాన్న పిలుపే మధురమైనదని, ఈ పదాలకు బదులుగా



కొత్తపల్లి పాఠశాలలో..

మమ్మీ, డాడీ వచ్చి చేరాయని వాటిని సమష్టిగా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. తెలుగు పుస్తకాలను తప్పనిసరిగా చదవాలని, మాతృ భాషకు ఇంట్లో కూడా అత్యధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పిల్లలకు పాఠశాల స్థాయి నుంచే మాతృభాష పట్ల అభిమానం పెంపొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తెలుగు భాషలో ప్రావీణ్యత కనబర్చిన విద్యార్థులకు డీఈవో ప్రశంసాపత్రాలను అందజేశారు. టీపీఆర్టీయూ జిల్లా సీనియర్ నేత, తెలుగు ఉపాధ్యాయుడు ఏ.మాణయ్య, వెంకటరమణచారి, లలిత, రామచంద్రయ్యలను సన్మానించారు. కార్యక్రమంలో తెలుగు సమాఖ్య సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పూర్ణకృష్ణ, సభ్యులు నాగభూషణం, శ్రవణ్, రవికుమార్, సత్తయ్య ఉపాధ్యాయులు సీ.మోహన్‌రెడ్డి, సురేష్‌గౌడ్, జయశంకర్ పాల్గొన్నారు.

అంతర్గాంలో

కల్హేర్/సిర్గాపూర్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గాం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్ స్వామి, వివి జెస్సిక పాల్గొన్నారు.

కొత్తపల్లిలో

పాపన్నపేట: మండల పరిధిలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా పండితులు స్వర్ణ, లలిత



చౌటకూర్‌లోని మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు కవితలు, పద్యాలు, తెలుగులో మాట్లాడడం, ఉపన్యాసం, వ్యాస రచన అంశాలలో పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌గౌడ్, మండల నోడల్ అధికారి ప్రతిప్‌రెడ్డి, ఉపాధ్యాయులు మాదవరెడ్డి, సోమశేఖర్, శ్రీనివాస్, ప్రసాద్‌రెడ్డి, తులసీరాం, మధు, దుర్గ రాములు, సంజీదా, సుహాసిని, కళావతి, స్వాతి పాల్గొన్నారు.

చేగుంటలో

చేగుంట: చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ, ఉపాధ్యాయులు వెంకటేశ్, లలిత, రాధా, సరస్వతి, రాథోడ్, రఘుపతి, రాజేశ్వర్, సుధాకర్‌రెడ్డి, శ్రీవాణి, శారద పాల్గొన్నారు.

మెదక్ బల్దియాలో దుకాణాల వేలంపాట

- రూ.లక్ష నుంచి ఐదు లక్షలకు పెరిగిన నెల అద్దె వసూళ్లు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 21: మూడు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న మెదక్ మున్సిపల్ దుకాణాల వేలంపాట ఎట్టకేలకు బుధవారం ముగిసింది. ప్రతి మూడు సంవత్సరాలకోసారి 33 శాతం అద్దె పెంచుతూ కొనసాగుతున్న బినామీల దుకాణాలు ఎట్టకేలకు బ్రేక్ పడిందని చెప్పవచ్చు. పాత బస్టాండ్ వద్ద ఉన్న మొత్తం 17 దుకాణాలకు గాను అధికారులు వేలంపాట నిర్వహించారు. ఇందులో 3 ఎస్సీలకు, ఒకటి నాయీబ్రాహ్మణ, ఒకటి ఎస్టీ, 9 జనరల్, ఇతరులకు 2, దివ్యాంగులకు ఒకటి చొప్పున కేటాయించారు. ఇందులో 5, 13వ దుకాణాలకు రూ.6వేలకు పైగా, మిగిలిన 15 దుకాణాలకు రూ.9వేలకు పైగా మున్సిపల్ అద్దెను నిర్ణయించారు. వాటిలో 9వ దుకాణం అత్యధికంగా రూ.55,100లకు దక్కించుకున్నారు. 17 దుకాణాలకు గాను నెలకు రూ.5 లక్షల 33 వేలు అద్దెల రూపంలో మున్సిపల్‌కు సమకూరనుంది. కాగా గతంలో మున్సిపాలిటీకి రూ.1,15,94 ఆదాయం వచ్చేది. ఇప్పుడు రూ.ఐదు లక్షలకు పెరగడం గమనార్హం. దుకాణాల వేలం పాటకు అబ్జర్వర్‌గా మైనింగ్ జయరాజ్, మరో అధికారి కృష్ణమూర్తి వ్యవహరించారు.

ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే

మెదక్: మెదక్ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ స్పష్టం చేశారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వేలం పాట ద్వారా రూ.5 లక్షల ఆదాయం సమకూరనున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీకి మరింతగా ఆదాయ వనరులు పెంపొందించడానికి కృషి చేస్తానన్నారు.

పాఠశాలలపై చర్యలకు వినతి

నారాయణఖేడ్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ఖేడ్ పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బుధవారం వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు సిహెచ్. అశోక్, సతీష్, తెంకటికుమార్, పవన్, ఇస్మాక్, లింగయ్య, తదితరులు ఖేడ్ ఎంఈవో విశ్వనాథ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అర్హతలు లేని వారిని ఉపాధ్యాయులుగా నియమించుకోవడంతో పాటు విద్యార్థులకు సదుపాయాలు కల్పించడం లేదన్నారు.

ఆలయ వార్షికోత్సవం

హవేళిఘణపూర్: మండలంలోని వాడి గ్రామంలో సిద్ధిరామేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యామిరెడ్డి, ఎంపీటీసీ జ్యోతి, సాయిలు, అశోక్ పాల్గొన్నారు.

రాచన్నస్వామి ఉత్సవ కమిటీ

కోహీర్: మండలంలోని బడంపేట గ్రామంలో గల రాచన్న స్వామి దేవాలయ ఉత్సవాలు మార్చి 14, 15, 16 తేదీల్లో జరగనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం ఉత్సవ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా దయానంద్ పాటిల్, కమిటీ సభ్యులుగా స్వరూప, శ్రీపాల్, గోపాల్, ప్రభాకర్, భీమ్‌సింగ్, రాజు, యాదయ్య అశోక్, అంజన్న, బస్వరాజ్, మహేశ్వర్‌స్వామి, చంద్రప్ప, నగేష్, జగదీష్‌స్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నార్సింగి మండలానికి రూ.కోటి 30 లక్షల నిధులు

చేగుంట: గ్రామాల్లో సీసీరోడ్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణంతో పాటు గోదాముల అభివృద్ధికి రూ.కోటి 30 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు బుధవారం పేర్కొన్నారు. నార్సింగి మండల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గోవర్ధన్, బాలరాజ్‌గౌడ్, లక్ష్మీనర్సింహులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

హత్నూర: మండల పరిధిలోని సాదుల్లానగర్‌లో గ్రామకంఠం భూమిని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కర్రి కృష్ణ, మరికొందరు ఆక్రమించారని తాజా మాజీ సర్పంచ్ బాస్కర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు మొగులయ్య, ఆరోపించారు. అధికారులు భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

ఎంపీడీవోకు సన్మానం

జిన్నారం: బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో రాములును, అలాగే నూతన ఎంపీడీవో అరుణను మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, అధికారులు, మాజీ సర్పంచులు బుధవారం ఘనంగా సన్మానించారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

ఝరాసంగం: ఎల్గోయి గ్రామంలో బుధవారం ఎంపీటీసీ సంగీతగుండప్ప హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో అంజద్, చంద్రశేఖర్, శంకర్, రామయ్య, ప్రభు, బాబు మియా, ఖయ్యూం, నర్సప్ప, నర్సింలు, దత్తు, వీరశెట్టి పాల్గొన్నారు.

సీఆర్పీల డైరీ ఆవిష్కరణ

సంగారెడ్డి అర్బన్: కలెక్టరేట్‌లో సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న క్లస్టర్ రీసోర్స్ పర్సన్స్(సీఆర్పీ) సంఘం నూతన డైరీని బుధవారం డీఈవో వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు మరెల్లి దత్తు, సీఆర్పీలు రమేశ్, లలిత, వరలక్ష్మీ, సరస్వతి, శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థుల వీడ్కోలు సమావేశం

జోగిపేట: అందోలు సాంఘిక సంక్షేమ గురుకులంలో 10 తరగతి, సీనియర్ ఇంటర్ విద్యార్థినులకు బుధవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయిలత, మాజీ ప్రిన్సిపాల్ రత్నరాజు, వైస్ ప్రిన్సిపాల్స్ అజ్మత్ బేగం, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

మెదక్ డీఎస్పీ ఫణీందర్ బదిలీ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 21: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం మెదక్ డీఎస్పీ ఫణీందర్‌ను సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బదిలీ చేశారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో పనిచేస్తున్న రాజేశ్వర్‌ను మెదక్ డీఎస్పీగా నియమిస్తూ డీజీపీ రవి గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు.

'గ్రామాల స్వచ్ఛతపై దృష్టి సారించాలి'

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 21: గ్రామాల స్వచ్ఛతపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మీగోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం చిన్నశంకరంపేట మండల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు స్వచ్ఛతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్య తలెత్తినా ఎంపీపీ, ఎంపీడీవో దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో దామోదర్, తహసీల్దార్ మన్నన్, ఎంపీవో గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.4లక్షలతో నీటి సౌకర్యం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, ఫిబ్రవరి 21: మహారాష్ట్రలోని పండరీపూర్‌లో నూతనంగా నిర్మించిన మోక్ష గజేంద్ర ఆశ్రమంలో డీసీసీబీ డైరెక్టర్, సిర్గాపూర్ మండలంలోని బొక్కస్‌గామ్ పీఏసీఎస్ చైర్మన్ గుండు వెంకటరాములు రూ.4 లక్షల సొంత ఖర్చులతో నీటి వసతి, ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేయించారు. బుధవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, పీఠాధిపతి గజేంద్ర భారతి మహరాజ్ ఆర్వో ప్లాంట్‌ను ప్రాంభించారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21: మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్ర (ఎస్‌బీఆర్‌ఎస్‌ఈటీఐ) డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాలోపు ఉండి పదవ తరగతి చదివి ఉన్నవారు అర్హులన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు సంగారెడ్డి పట్టణంలోని సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారికి మార్చి 4నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 9490103390, 9490129839 నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

జోగిపేట, ఫిబ్రవరి 21: నేరడిగుంట గ్రామంలోని హనుమాన్, దుర్గ ఆలయాల్లో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి హాజరై మాట్లాడారు. ఆలయాలతోనే దేశంలో సనాతన ధర్మ పరిరక్షణ జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పాల్గొని, ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నారాయణ, ఎంపీపీ జోగు బాలయ్య, తాజా మాజీ సర్పంచ్, ధ్వజస్తంభ దాత మైలుగండ్ల చందులత, వీర మల్లప్ప, ఎంపీటీసీ క్రిష్ణాగౌడ్, పట్లోల్ల రవి, మాజీ సర్పంచ్ డప్పు రాంచందర్, మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ పద్మశివరాజ్, వీరేశంగుప్తా పాల్గొన్నారు.

నర్సారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

తూప్రాన్, ఫిబ్రవరి 21: గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి చొరవతో హల్దీవాగు పరివాహక ప్రాంత రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కొండపోచమ్మ సాగర్ నుంచి కాళేశ్వరం జలాలను మూడురోజుల క్రితం విడుదల చేసింది. బుధవారం తూప్రాన్ మండలం యావాపూర్‌లోకి ప్రవేశించాయి. దీంతో యావాపూర్, తూప్రాన్ పట్టణ సమీపంలోని కిష్టాపూర్ మార్గంలోగల చెక్‌డ్యాంలు నిండి ప్రవహిస్తున్నాయి. దీంతో రైతులు తూప్రాన్ చెక్‌డ్యాం వద్ద గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.

పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో

కంగ్టి, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని బోర్గి ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఎంపీడీవో సత్తయ్య సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో నర్సింలు, టీఏ శ్రీనివాస్, ఎస్ఏ ప్రకాష్, కార్యదర్శి అరుణ్ ఉన్నారు.

సంగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో సందడిగా 'విపణి'

- హాజరైన కలెక్టర్ వల్లూరు క్రాంతి
- విద్యార్థినుల వంటకాలను రుచి చూసిన కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 21: సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన విపణి కార్యక్రమం సందడిగా సాగింది. విద్యార్థినులను ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో విపణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. విద్యార్థినులు సొంతంగా వండి తయారు చేసిన ఆహార పదార్థాలు, వివిధ రకాల వంటకాలు, తినుబండారాలతో పాటు కుట్లు, అల్లికలు, డిజైన్ చేసిన దుస్తులను ప్రదర్శనగా ఉంచి విక్రయించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వల్లూరు క్రాంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండు గంటల పాటు ఉండి విపణిలో ఏర్పాటు చేసిన ప్రతీ స్టాల్‌ను సందర్శించారు. విద్యార్థినులు చేసిన వంటకాలను రుచి చూసి, డబ్బులు కూడా చెల్లించారు. బిర్యానీ తిని గోలీ సోడా తాగారు. కలెక్టర్ తన కుడి చేతికి మెహిందీ కూడా వేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినులు ఎవరి మీద ఆధారపడకుండా స్వతహాగా ఎదగాలని అప్పుడే సమాజం, కుటుంబంలో గౌరవం ఉంటుందన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగుతూ వ్యాపారంలోనూ ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుణాబాయి, కామర్స్ అధ్యాపకులు అశోక్, నవ్య, అధ్యాపకులు హుమేరాసయీద్, కృష్ణప్రియ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

- కార్మికుల డిమాండ్, కలెక్టరేట్ ఎదుట ధర్నా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 21: వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, పూట గడవడం కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతాలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ రమేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆసీఫ్, సంఘ సభ్యులు శేఖర్, పద్మారావు, సిద్ధిరాములు, సత్యం, ఎల్లం, రాములు, మరియమ్మ, స్వామి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

పెండింగ్ స్కాలర్‌షిప్స్‌ను విడుదల చేయాలి

- ఏబీవీపీ నాయకుల డిమాండ్, ధర్నా



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఏబీవీపీ నాయకులు

మెదక్ అర్బన్, ఫ్రిబవరి 21: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుద చేయాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు శశికాంత్ మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్స్ విద్యార్థుల భిక్ష కాదని, అది హక్కు అని అన్నారు. స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నదని ఆరోపించారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి బకాయిలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్, మల్లేశం, కార్తికేయ, నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా సమ్మక్క-సారలమ్మ జాతర



జాతలో బోనంతో వెళ్తున్న జ్యోగిని శ్యామల

పటాన్‌చెరు, ఫిబ్రవరి 21: అమీన్‌పూర్‌లో సమ్మక్క-సారలమ్మ జాతర బుధవారం వైభవంగా ప్రారంభమైంది. పెద్ద ఎత్తున భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. జ్యోగిని శ్యామల నేతృత్వంలో నిర్వహించిన బోనాల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, భారతీనగర్ కార్పొరేటర్ సింధుఆదర్శరెడ్డి, ఆలయ ధర్మకర్త నీలం భిక్షపతిముదిరాజ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ యువ నాయకుడు తుమ్మల రుష్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు గుమ్మడిదలలో విద్యుత్ సరఫరా బంద్

గుమ్మడిదల, ఫిబ్రవరి 21: బొంతపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా మండలంలో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రవీందర్ తెలిపారు. వినియోగారులు సహకరించాలని కోరారు.

బీఆర్‌ఎస్‌కు రెడ్డిపల్లి

పీఏసీఎస్ చైర్మన్ రాజీనామా

చేగుంట, ఫిబ్రవరి 21: చేగంట మండలం రెడ్డిపల్లి పీఏసీఎస్ చైర్మన్ మేకల పరమేష్ బీఆర్‌ఎస్ పార్టీకిరాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేగుంట మండలంలోని బీఆర్‌ఎస్ బీసీ ప్రజాప్రతినిధులకు సముచిత స్థానం కల్పించడంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పార్టీ కార్యక్రమాలకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని తెలిపారు. బీసీలకు, ఎస్సీలకు పార్టీలో తగిన ప్రాధాన్యమివ్వనందునే బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసినట్లు మేకల పరమేష్ పేర్కొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు విద్యాసంస్థల్లో ప్రత్యేక ఓటరు నమోదుపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎన్నికల అధికారి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 01.04.2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని మెడికల్, ఇంజనీరింగ్, బీఎడ్, డిగ్రీ కళాశాలల్లో ఓటరు నమోదుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో సంగారెడ్డి తహసీల్దార్ దేవిదాస్, అనిత, విజయలక్ష్మి, సరస్వతి, శాంతకుమారి, డీఏవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

అద్దెకు వ్యవసాయ యంత్రాలు

శివ్వంపేట, ఫిబ్రవరి 21: ఆధునిక వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను ఐకేపీ ఆధ్వర్యంలో అద్దెకు ఇవ్వనున్నట్లు ఏపీఎం వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. రోటవేటర్, గడ్డి కట్టె యంత్రం, పెట్రోల్ చార్జింగ్ స్ప్రేలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమున్న రైతులు అద్దెకు తీసుకెళ్లవచ్చునని చెప్పారు. కొనుగోలు చేయలేని చిన్న, సన్నకారు రైతులకు ఆధునిక పనిముట్లు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో అద్దెకు అందిస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించేలా ఎదగాలి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21: తోటి కార్మికుల సమస్యలను పరిష్కరించేలా గృహకార్మికులు ఎదగాలని మెడ్వాన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని సంస్థ కార్యాలయంలో బుధవారం గృహకార్మికులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహకార్మికులందరూ కలిసికట్టుగా ఉండి, సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. హక్కులను కాపాడుకునేందుకు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయవాది విఠల్ సూచించారు. కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ స్వప్న, సమీర్ పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

పుల్‌కల్, ఫిబ్రవరి 21: నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు హెచ్చరించారు. మండలంలోని శివంపేట, చౌటకూర్, పుల్కల్ గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అలాగే మిన్‌పూర్‌లో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్ణీత మోతాదులోనే రసాయన ఎరువులను వినియోగించాలని రైతులకు ససూచించారు. ఆయన వెంట జోగిపేట ఏడీఏ అరుణ, ఏఈవో చైతన్య, ఏఈవోలు ఉన్నారు.



శివంపేటలో పురుగు మందుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి నర్సింహారావు

తూప్రాన్‌లో

తూప్రాన్: తూప్రాన్ పట్టణంలోని ఎరువుల దుకాణాలను బుధవారం జిల్లా వ్యవసాయ అధకారి ఎం.గోవింద్ తనిఖీ చేశారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా చూసుకోవాలన్నారు. ఈ-పాస్ మిషన్ ద్వారానే ఎరువుల అమ్మకం చేయాలని, పీఎం కిసాన్ కోసం రైతులు ఈకేవైసీ తప్పకుండా చేసుకోవాలని సూచించారు. వరి పంటను ఆశించిన మొగి పురుగు నివారణకు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తీసుకోవాలని రైతులకు చెప్పారు.

ఆర్‌ఎస్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న దళిత సమాజ్ నాయకులు

జహీరాబాద్, ఫిబ్రవరి 21: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని జన్‌వాడ గ్రామంలో దళితులు, క్రైస్తవులతో పాటు చర్చిపై దాడి చేసిన ఆర్‌ఎస్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని దళిత సాలిడారిటీ మూమెంట్(డీఎస్‌ఎం) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి దాడులకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులు, క్రైస్తవులపై దాడులు ఆపకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్‌ఎం జిల్లా అధ్యక్షుడు హేమానంద్, నాయకులు ప్రదీప్, చిరంజీవి, మోహన్, ధన్‌రాజ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్, ఫిబ్రవరి 21: బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన మొగుడంపల్లిలో బుధవారం జరిగింది. చిరాగ్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగుడంపల్లికి చెందిన పడి రాజు(25) కుటుంబంలో జరుగుతున్న గొడవలు, ఇతర కారణాలతో మనస్థాపానికి గురై బావిలో దూకి, ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు వెళ్లి, బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఫైజాబాద్‌లో గేదెల షెడ్డు దగ్ధం

చిలప్‌చెడ్, ఫిబ్రవరి 21: అనుమానాస్పద స్థితిలో గేదెల షెడ్డు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని ఫైజాబాద్ గ్రామంలో చోటుచేసుకుంది. బుధవారం స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని టేకుల నర్సింహారెడ్డికి చెందిన గేదెల షెడ్డు మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో దహనమైంది. నర్సాపూర్, జోగిపేటల నుంచి రెండు ఫైర్‌ఇంజన్‌లు వచ్చి మంటలు చల్లార్చాయి. అప్పటికే గడ్డి మోపులతో పాటు షెడ్డు కూడా పూర్తిగా కాలిపోయింది. 4 గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. 300 గడ్డి మోపుల విలువ రూ.30 వేలు కాగా, ఒక్కొక్క గేదె విలువ రూ.లక్షా 20 వేలు ఉంటుందని నర్సింహారెడ్డి తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో షెడ్డు కాలిపోయినట్లు ఆయన ఆరోపించాడు. అదే గ్రామానికి చెందిన మినుపూరి పోచయ్యకు చెందిన 200 గడ్డి మోపులు, వంజరి మొగులయ్యకు చెందిన 80 గడ్డి మోపులు కూడా కాలిపోయాయి. ఎవరో కావాలనే నిప్పు పెట్టారని బాధితులు ఆరోపించారు.

పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 21: పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. బుధవారం పెద్దశంకరంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నతపాఠశాలలో ఆయన పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల హాజరు శాతాన్ని, అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పరీక్షలకు భయపడకుండా ప్రశాంతంగా రాసి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఆయనవెంట మండల విద్యాధికారి వెంకటేశం, రాజేశ్వర్, విఠల్, ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్, ప్రసన్నకుమార్, విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధిపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సూర్యారావు

నర్సాపూర్, ఫిబ్రవరి 21: గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడే శిక్షణ ఇచ్చి వారు స్వశక్తితో నిలబడేలా తీర్చిదిద్దడంలో ఐకేపీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌డీఏ పీడీ సూర్యారావు సూచించారు. బుధవారం నర్సాపూర్ ఐకేపీ కార్యాలయంలో నర్సాపూర్, శివ్వంపేట మండలాల ఐకేపీ సిబ్బందితో లక్పతీ దీదీ అనే అంశంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు పీడీ మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులకు సంవత్సరానికి కనీసం లక్ష రూపాయల ఆదాయం వచ్చేలా ఐకేపీ సీఏలు, సీసీలు, ఏపీఎంలు తీర్చిదిద్దాలని సూచించారు. అందుకు అవసరమైన సమాచారం, నైపుణ్యం, శిక్షణలు, ఆర్థిక తోడ్పాటును అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైయినర్స్ మోహన్, డీపీఎం రుక్మిణీ, ఏపీఎంలు గౌరిశంకర్, వెంకటేశ్వర్లు, సీసీలు ఆంజనేయులు, ప్రవీణ, భాగ్య, దేవిసింగ్, రవీందర్, సరిత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

'డంప్‌యార్డును వినియోగంలోకి తేవాలి'

నర్సాపూర్, ఫిబ్రవరి 21: నర్సాపూర్ మున్సిపాలిటీకి సంబంధించిన డంప్‌యార్డు నిర్మాణం త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. బుధవారం డంప్‌యార్డు పనులను పరిశీలించి పనులు వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. డంప్‌యార్డు లేక పట్టణ పరిధిలోని చెత్తను డంప్ చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కాగా మియావాకిలో మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మొక్కల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, వార్డ్ ఆఫీసర్ రాములు, నర్సింగ్, జేమ్స్ తదితరులు ఉన్నారు.

సీఎస్ఆర్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

జిన్నారం, ఫిబ్రవరి 21: కాజీపల్లిలో సీఎస్ఆర్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. బుధవారం ఔటర్ సర్వీస్ రహదారి నుంచి కాజీపల్లి గ్రామం వరకు హెటిరో పరిశ్రమ సీఎస్ఆర్ నిధులు రూ.కోటి 70లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఇటీవల ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఈ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయగా పనులను మాజీ సర్పంచ్ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులు, హెటిరో పరిశ్రమ ప్రతినిధి రవిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీఎం జీవన్‌జ్యోతి బీమా చెక్కుల అందజేత

కంగ్టి, ఫిబ్రవరి 21: బోర్గి గ్రామానికి చెందిన బాబాల లక్ష్మిబాయి, కంగ్టికి చెందిన కాడే రాజు కంగ్టిలోని గ్రామీణ వికాస్ బ్యాంకులో పీఎం జీవన్‌జ్యోతి బీమా చేయించుకున్నారు. వారు ఇటీవలే మృతిచెందడంలో బాధితుల నామినిలకు రూ.రెండు లక్షల చెక్కులను బుధవారం ఏపీజీవీబీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్, ఆర్ఎం ప్రసాద్ అందజేశారు. లక్ష్మిబాయి నామిని యోగేశ్వర్‌కు, కాడే రాజు భార్యకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంఐ సుబ్బారావు, బ్యాంకు మేనేజర్ శాంబిరావత్, ఫీల్డ్ ఆఫీసర్ రమేష్‌రెడ్డి, నరేష్, కోశాధికారి భూమయ్య, వెంకటరెడ్డి, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.